క్లుప్తంగా

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

నెల్లిమర్ల రూరల్: ఎన్నికల్లో గెలుపు కోసం స్థానిక ఎమ్మెల్యే లోకం మాధవి నియోజకవర్గ ప్రజలకు, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని సీతారామునిపేటలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎమ్మెల్యే వాడిన భాష బాధాకరమని, తక్షణమే వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం నియోజకవర్గంలో 100 పరిశ్రమలు స్థాపించి ఉద్యోగాలు కల్పిస్తామని యువతకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, నెలలు గడుస్తున్నా ఆ ఊసే లేదన్నారు. మోసపోయామని యువత గగ్గోలు పెడుతున్నారని, ముందు ఆ సంగతి చూడాలన్నారు. జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదని, ముందు హామీల అమలుపై దృష్టి సారించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క పింఛన్ తప్ప ఏమీ ఇవ్వలేదని, ఎవరు జోకర్‌గా కనిపిస్తున్నారో ప్రజలకు బాగా తెలుసన్నారు.

పోలింగ్ ఏర్పాట్లు పూర్తి



పూసపాటిరేగలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

పూసపాటిరేగ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. గురువారం ఉదయం 8 గంటల నుండి సాయింత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోలింగు సిబ్బంది ఎన్నికల సామగ్రితో మండల కేంద్రంలో వున్న కేంద్రాలకు బుధవారం చేరుకున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో 324 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పూసపాటిరేగ మండలంలో 30 మంది, భోగాపురంలో 36 మంది, డెంకాడలో 75 మంది, నెల్లిమర్లలో 183 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

సత్య కళాశాలలో ఆధ్యాత్మిక బోధనలు

విజయనగరం అర్బన్: సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో బుధవారం బుద్ధీజియం ఆధ్యాత్మిక బోధనలు నిర్వహించారు. 'చాంగ్ హ్యాటాంగ్ ట్యుటెక్ హ్యా' అనే బౌద్ధ సంస్థ గురూజీ హాంగ్ ముఖ్యఅతిథిగా హాజరయి బోధనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని, ఆ ప్రయత్నంలో సంపాదించిన పరిజ్ఞానాన్ని తోటి విద్యార్థులతో పంచుకుంటే అందరి నుంచి వచ్చిన దీవెనలు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి తోడవుతాయని అన్నారు. అందరినీ గౌరవించడం, మంచి విలువలతో బతకడం, జాలి, దయ, కరుణ వంటి గుణాలను కలిగి ఉండటం, ఇతరులకు సహాయ పడటం, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండటం వంటి మంచి గుణాలు అలవరుచుకుంటే జీవితం చక్కగా ఉంటుందని వివరించారు. అనంతరం గురూజీ దంపతులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ సభ్యులు మిస్ కోహ్‌తో పాటు సభ్యుల బృందం, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎం.సత్యవేణి, బి.సూరపునాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయసాగర దుర్గా మల్లేశ్వరస్వామి ఊరేగింపు



భక్తులకు దర్శనమిస్తున్న నందీశ్వరుడు, శివలింగం

విజయనగరం టౌన్: స్థానిక పెద్దచెరువు గట్టు వద్ద కొలువుదీరిన విజయసాగర దుర్గామల్లేశ్వర స్వామి వారు మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని పురవీధుల్లో ఊరేగి భక్తులను ఆశీర్వదించారు. హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కొండబాబు నేతృత్వంలో గుర్రాల రథాలపై స్వామివారిని కొలువుదీర్చి, భాజాభజంత్రీలతో, మేళతాళాలతో, భజన కీర్తనలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించి, తరించారు.



విద్యుత్ అలంకరణలతో గుర్రాలపై ఆశీనులైన స్వామివారు



విజయనగరం: శివాలయం వీధిలోని ఉమారామలింగేశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు



డెంకాడ: చింతలవలస ఏపీఎస్‌పీ బెటాలియన్ వద్ద ఉన్న శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

హరహర మహాదేవ.. శంభో శంకర

- కన్నుల పండువగా మహాశివరాత్రి పర్వదినం
- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు బుధవారం శివనామస్మరణతో మార్మోగాయి. హరహర మహాదేవ.. శంభో శంకర నామస్మరణతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయాల్లో రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతిర్లింగాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే శివాలయాల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. పలుచోట్ల అన్న సమారాధన నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



విజయనగరం గంటస్తంభం: అయ్యకోనేరు దక్షిణగట్టులో గల శ్రీఉమామహేశ్వరునికి ప్రత్యేక అర్చనలు



విజయనగరం గంటస్తంభం : దాసన్నపేట కాపువీధిలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన అర్చకులు



పూసపాటిరేగ: కొవ్వాడ శివాలయంలో రుద్రాభిషేకంలో పాల్గొన్న మహిళలు



విజయనగరం టౌన్: స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



విజయనగరం టౌన్ : జ్ఞాన సరస్వతి అమ్మవారికి ప్రత్యేక హారతి ఇస్తున్న అర్చకులు



విజయనగరం టౌన్: షిర్డీ సాయిబాబా ఆలయంలో శివలింగం ఆకృతిలో దీపాలు

మాంస విక్రయ దుకాణాలపై కొరడా

- అపరాధ రుసుం విధించి మూసివేత

విజయనగరం: మహాశివరాత్రి పర్వదినాన మాంస విక్రయాలు చేపట్టిన దుకాణాలకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అపరాధ రుసుము విధించి దుకాణాలను మూసివేయించారు. బుధవారం నగరంలోని పలుచోట్ల పర్యటించిన ఆయన పారిశుధ్య విధానాన్ని పరిశీలించారు. రహదారులను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న బడ్డీలను, వ్యాపారాలను అక్కడి నుంచి తరలించి వేశారు. చిరు వ్యాపారులను క్రమబద్ధీకరించే చర్యల్లో భాగంగా సూచించిన స్థలాల్లో మాత్రమే వ్యాపారాలు సాగించాలని చెప్పారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలో మాంసవిక్రయాలు చేపట్టరాదని ప్రకటించినప్పటికీ కొంతమంది దుకాణాలు తెరిచి మాంస విక్రయాలు సాగించడంతో ఆయా షాపుల వద్దకు వెళ్లి అపరాధ రుసుము విధించారు కంటోన్మెంట్, ఎస్.బి.టి. మార్కెట్ ప్రాంతంలో తెరిచి ఉన్న చికెన్ దుకాణం వద్దకు వెళ్లి రూ.3వేలు అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు వివిధ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టామన్నారు. వాటిని పాటిస్తూ నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు.



మాంసం విక్రయిస్తున్న దుకాణాన్ని మూయించిన నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పూల్‌బాగ్ స్టేషన్ పరిధిలో బ్యూటిఫికేషన్ వర్క్‌లో భాగంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయింత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.త్రినాధరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీగణపతి కాలనీ, సుబ్రహ్మణ్యం స్వామి టెంపుల్ ఏరియా, జగదాంబ నగర్, గోల్డెన్ వ్యాలీ లేఅవుట్, పూల్‌బాగ్ కాలనీ, మెయిన్ రోడ్, హాజీ ఆలీ నగర్, మంగల వీధి ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు తోడుగా క్షత్రియ సమాజం

విద్యార్థులకు క్షత్రియ సమాజం తోడునీడగా ఉంటుందని క్షత్రియ పరిషత్ కార్యదర్శి సాగి శివాజీరాజు అన్నారు. విద్యార్థులకు చేయూత కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన క్షత్రియ యూత్ ఫెడరేషన్ జొన్నవలస జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు అక్కడి గ్రామ పెద్దలతో కలిసి ఎగ్జామ్స్ పాడ్స్, జామిట్రీ బాక్సులు, పెన్నులు బుధవారం పంపిణీ చేశారు. ట్రెజరర్ జి. రామరాజు, సభ్యులు అప్పన్నబాబు, రాజేష్‌బాబు, జీఎస్ఎన్ రాజు, శేఖర్ యూత్ పరిషత్ సభ్యులు ఈపూరి శేఖర్‌రాజు, లక్ష్మీపతి వర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

- విజయనగరం



నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణం

- నిరుపేదలకు తప్పని పాట్లు
- ఇంటి బిల్లులు విదల్చని కూటమి సర్కారు
- నియోజకవర్గంలో 77 లే అవుట్‌లు

నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో కాలనీ లే అవుట్‌ల వివరాలు

మండలం	లేఅవుట్‌ల సంఖ్య	ఇళ్లు
రాజాం అర్బన్	3 లే అవుట్‌లు	1037
రాజాం	24 లే అవుట్‌లు	495
రేగిడి	17 లే అవుట్‌లు	309
సంతకవిటి	16 లే అవుట్‌లు	105
వంగర	17 లే అవుట్‌లు	148

రాజాం:

సొంతిల్లు కట్టుకోవాలని కలలుగన్న పేద వారి కలలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవేర్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే రాజకీయాలకు అతీతంగా మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి జగనన్న కాలనీల నిర్మాణం ప్రారంభించారు. ఇల్లు కట్టుకునేందుకు కనీసం స్థలం కూడా లేనివారికి ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు వారికి ఇంటిబిల్లులు మంజూరు చేయించారు. దీంతో పలుగ్రామాల్లో పెద్ద ఎత్తున లే అవుట్‌ల నిర్మాణం జరిగింది. గ్రామాలకు గ్రామాలే కొత్తగా వెలిశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ కాలనీలపై కన్నెర్రజేసింది. ఇంటి నిర్మాణదారుల బిల్లులు నిలిచిపోయాయి. దీంతో కాలనీలో నిర్మాణాలు మందగించాయి. అద్దె ఇళ్లలో నివాసముంటున్న పలువురు లబ్ధిదారులు కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తయితే వాటిలోకి వెళ్లి, ఇంటి అద్దె భారంనుంచి ఒడ్డెక్కవచ్చునని భావించారు. ఇప్పుడు ఆ కథ తలకిందులుగా మారింది.





రాజాం పట్టణం కంచరాం సమీపంలో నిర్మాణంలో కాలనీ, (ఇన్‌సెట్లో) రేగిడి మండలం మెట్టవద్ద గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాలనీ

ఇంటి బిల్లులు రాకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. ఈ ఇళ్లు ముందుకు వెళ్తాయో లేవో అనే సందిగ్ధంలో లబ్ధిదారులు కొట్టుమిట్టాడుతున్నారు.

ఊరూరా కొత్త కాలనీలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో కొత్త కాలనీలు, కొన్నిచోట్ల కొత్త ఊళ్లు ఏర్పడ్డాయి. ప్రతి చోటా కనీసం 15 మంది నుంచి అత్యధికంగా 1037 మంది వరకూ లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. పేదవాడికి ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణ బిల్లు చెల్లించడంతో గతంలో సెంటు భూమి లేని పేదలంతా ఒక ఇంటిని నిర్మించుకునే స్థాయికి వచ్చారు. కొంతమంది సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఇళ్లలో దిగారు. మధ్యస్తంగా నిర్మాణంలో ఉన్నవారికి గత తొమ్మిది నెలలుగా ఒక్క పైసా బిల్లు అందలేదు. గతంలో ఎంతో కొంతమేర బిల్లులు చెల్లించినవారికే ఇప్పుడు బిల్లులు ఇస్తామని, ఇంతవరకూ నిర్మాణాలు పూర్తిచేయకపోవడంతో బిల్లులు క్యాన్సిల్ అయ్యాయని అధికారులు చెప్పడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. రాజాం నియోజకవర్గంలో రాజాం మున్సిపాలిటీతో పాటు మండలంలో మొత్తం 77 లే అవుట్‌లు ఏర్పడ్డాయి. వాటి వద్ద ప్రజలకు నిర్మాణాలతో పాటు నివాసాల సమయంలో ఇబ్బంది లేకుండా ఉండేందుకు ముందుగానే రూ.5.80 కోట్లతో విద్యుత్ సౌకర్యం, రూ.1.95 కోట్లతో తాగునీరు, వాడుకనీటి సదుపాయాలు, రూ.2.30 కోట్లతో రహదారి సౌకర్యాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ ఇళ్లు నివాసాలకు పనికిరావని ప్రచారం చేయడంతో పాటు గత లబ్ధిదారులకు ఒక్క పైసా కూడా ఇవ్వకుండా తాత్సారం చేస్తోంది. ఈ విషయంపై హౌసింగ్ డీఈఈ రత్నాకర్ వద్ద సాక్షి ప్రస్తావించగా పాత లబ్ధిదారులకు గతంలో ఎంతో కొంత నిర్మాణం పూర్తిచేసి, బిల్లులు చెల్లించి ఉంటే మిగిలిన బిల్లులు వస్తాయని, ప్రస్తుతం లబ్ధిదారుల లిస్టులో వారు ఉన్న గతంలో బిల్లు ఇవ్వకుంటే ఇప్పుడు ఇవ్వడంలేదని అన్నారు. కొత్త లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అనంతరం కాలనీల్లోని గత లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపునకు మార్గదర్శకాలు వస్తాయన్నారు.

ఆందోళనగా ఉంది..

మా స్వగ్రామం మజ్జిరాముడుపేట. రోజువారీ కూలిపని చేసుకుంటూ బతికేవాళ్లం. సొంత ఇల్లు లేదు. మాకు ఉంగరాడమెట్ట వద్ద ఇంటి పట్టాతో పాటు ఇంటిని నిర్మించుకునేందుకు బిల్లులు గత ప్రభుత్వంలో అధికారులు మంజూరు చేశారు. శ్లాబ్ వరకూ నిర్మాణం పూర్తిచేశాం. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత మీ బిల్లు క్యాన్సిల్ అయ్యిందని అంటున్నారు. దీంతో మాకు ఆందోళనగా ఉంది.

పుల్లాక తులసి, మజ్జిరాముడుపేట, రేగిడి మండలం

ఊరుకాని ఊరిలో

మాది పార్వతీపురం మన్యం జిల్లా. రాజాంలో కొన్నేళ్లుగా స్థిరపడ్డాం. వస్త్రపురికాలనీ సమీపంలో అద్దె ఇంట్లో ఉంటున్నాం. మాకు కంచరాం వద్ద జగనన్న కాలనీలో ఇంటి పట్టా ఇచ్చి ఇంటి బిల్లును గత ప్రభుత్వం మంజూరుచేసింది. సగం నిర్మాణం పూర్తిచేశాం. ఇప్పుడు మీ ఇంటి బిల్లు క్యాన్సిల్ అయిందంటున్నారు. దీంతో నిర్మాణం మధ్యలో వదిలేశాం. ఊరికాని ఊరిలో అద్దె ఇళ్లలో నివసిస్తున్నాం.

ఎం.రమ, రాజాం